నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 3 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

సారో.. మా సంగతేంది?

- గగ్గోలు పెడుతున్న రుణమాఫీ కాని రైతులు
- వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకులు, సొసైటీల వద్దకు పరుగులు
- నాల్గో జాబితాలోనూ పేరు రాకపోవడంతో అసహనం
- రెండు లక్షల పైబడిన వారి పరిస్థితి అయోమయం
- కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న అన్నదాతలు

ఖమ్మం, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నాల్గో విడత రుణమాఫీ జాబితాలో తమ పేరు ఎందుకు రాలేదో చెప్పాలని జిల్లావ్యాప్తంగా పంట రుణాలు తీసుకున్న రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీల బాధ్యులను ప్రశ్నిస్తున్నారు. సోమవారం మండల, జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ ఉండడం వల్ల అధికారులు అందుబాటులో లేరు. దీంతో కొందరు రైతులు ఫోన్ల ద్వారా వాకబు చేయగా, మరికొందరు రైతులు గ్రామ వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల చుట్టూ తిరిగారు. సొసైటీలో సైతం సీఈవోలు, చైర్మన్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన పేరుతో అందుబాటులో లేకుండాపోయారు. నాల్గో విడతలోనైనా తమ పేరు వచ్చిందేమో చూడాలని రైతులు ఆయా కార్యాలయాల్లో ఉన్న సిబ్బందిని అడగగా.. పూర్తిస్థాయి జాబితా సోమవారం సాయంత్రం వరకు వస్తుంది, వాట్సప్‌లో వచ్చిన జాబితా ఆధారంగా చెప్పలేమని వారికి బదులిచ్చారు. ఒకవైపు వానకాలం సీజన్ ముగిసింది. యాసంగి సీజన్‌లోనైనా పంట రుణాలు తీసుకుందాంలే.. అనుకున్న రైతులకు నాల్గో విడత రుణమాఫీ జాబితా నిరాశపరిచింది. ఇప్పటికే రూ.2 లక్షల పైబడి అప్పు ఉన్న వందలాది మంది రైతులు పైబడిన సొమ్మును బ్యాంకులకు చెల్లించారు. రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు సైతం పలు సాంకేతిక కారణాలతో మాఫీ జరగలేదు. అయితే రేషన్‌కార్డు ఎడిట్, ఆధార్, బ్యాంకు అకౌంట్‌లో పొరపొచ్చాలు పూర్తిచేసిన వారి పేరు సైతం నాల్గో విడుత జాబితాలో లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మాఫీ చేస్తాం అంటే చేయాలి, చేతకాకపోతే చెప్పాలి. మేమైనా అప్పుడప్పుడు ఎంతో కొంత కట్టుకునే వాళ్లమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో జాబితా ఉంటుందా, ఇంతటితో రుణమాఫీ ప్రక్రియ ముగిసినట్టేనా అనేది స్పష్టత లేకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు.



రూ.2 లక్షలకు పైబడి రుణాలు తీసుకొని మిగిలిన డబ్బులు చెల్లించిన తర్వాత ఏవో కార్యాలయానికి వచ్చిన రైతులు

రెండులక్షల పైబడినవారి సంగతేంటి..?

రూ.2 లక్షలకు పైబడి పంట రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ వర్తిస్తుందో.. లేదో.. నెలలు గడిచినా ఇంతవరకు స్పష్టత రాలేదు. సొసైటీలో ఒక విధంగా, బ్యాంకుల్లో మరో విధంగా, అధికారులు ఇంకోవిధంగా చెబుతుండడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే కొందరు బ్యాంకు అధికారులు రూ.2 లక్షల పైబడి అప్పు ఉన్నవారి నుంచి పై డబ్బులు కట్టించుకున్నారు. ఇలా కడితేనే రుణమాఫీ జరుగుతుందని చెప్పడంతో అప్పటికప్పుడు రైతులు మిగిలిన సొమ్మును అప్పు చేసి మరీ చెల్లించారు. అయితే గత కొద్దిరోజుల క్రితం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టత ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన తర్వాతే పైడబ్బులు చెల్లించాలని చెప్పడంతో తిరిగి ఆ మరుసటిరోజు నుంచి అధికారులు యూటర్న్ తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 16 రకాల బ్యాంకుల్లో కలిపి 3,71,157 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. వీరికి సుమారుగా రూ.4,307 కోట్ల రుణమాఫీ వర్తించే అవకాశం ఉంది. అయితే నేటివరకు నాలుగు విడతలు కలిపి 1,33,197 మంది రైతులకు గాను రూ.926 కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగింది. గతంలో ప్రభుత్వం రూ.2 లక్షల పైబడి రుణాలు తీసుకున్న రైతులు పై నిధులను చెల్లిస్తే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

విడతల వారీగా జరిగిన రుణమాఫీ వివరాలు

దశ(విడత)	రైతుల సంఖ్య	నిధులు(రూ.కోట్లలో)
ఫేజ్-1	57,857	రూ.264.22
ఫేజ్-2	33,942	రూ.262.50
ఫేజ్-3	23,546	రూ.245.85
ఫేజ్-4	17.852	రూ.154.03
మొత్తం	1,33,197	రూ.926.60

పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య : 3,71,157

తీసుకున్న పంట రుణాల మొత్తం : రూ.4,307 కోట్లు

నేటివరకు రుణమాఫీ పొందిన రైతుల సంఖ్య : 1,33,197

రుణమాఫీ జరిగిన నిధులు : రూ.926.60 కోట్లు

మూడోవిడత రుణమాఫీ అప్పటినుంచి వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ వాళ్ల చుట్టూ తిరుగుతున్నాను. కెనరా బ్యాంకులో పంట రుణం రూ.2 లక్షలు తీసుకున్నాను. వడ్డీతో రూ.2.50 లక్షలు

అప్పటికప్పుడు రూ.50 వేలు కట్టాను

అయ్యింది. అధికారులు, బ్యాంకు వాళ్లు చెప్పినట్టుగా అప్పటికప్పుడు పై రూ.50 వేలు అప్పు తీసుకొచ్చి మరీ కట్టాను. పై డబ్బులు కడితేనే పేరు పైకి పోతది.. రుణమాఫీ జరుగుతదని చెప్పారు. కానీ.. ఈసారి కూడా నా పేరు రాలేదు. నాతోపాటు చాలా మంది ఇదే సమస్యతో తిరుగుతున్నాం. ఉన్నది ఉన్నట్లు ఎవరూ చెప్పడం లేదు. మరో లిస్టు ఉంటది అంటున్నారు. నిజమో కాదో తెలియడం లేదు.

– భూక్యా వెంకన్న, రైతు, లకావత్‌తండా, ఖమ్మంరూరల్ మండలం

సర్కార్‌పై అన్నదాతల ఆగ్రహం

రుణమాఫీపై అధికారులు, బ్యాంకర్లు రోజుకో రకంగా మాట మారుస్తుండడంతో అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడు నెలల నుంచి అదిగో రుణమాఫీ.. ఇదిగో రుణమాఫీ అంటూ కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. తమతోపాటు పంట రుణాలు తీసుకున్న కొందరికి రుణమాఫీ చేసి మాకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లు రేషన్‌కార్డు, ఆధార్ తప్పులు, నెంబర్ తేడా అంటూ సాకులు చెప్పిన ప్రభుత్వం వాటిని సరిచేశాక కూడా ఎందుకు రుణమాఫీ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. నాల్గో విడతలోనూ రూ.లక్షలోపు, రూ.1.50 లక్షలలోపు ఉన్న రైతుల పేర్లు సైతం లేకపోవడంతో సదరు రైతులు సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంక్లర్లు, సొసైటీ బాధ్యుల చుట్టూ తిరిగిన దృశ్యాలు జిల్లావ్యాప్తంగా కనిపించాయి.

రూ.85 వేలు రుణమాఫీ కాలేదు..

నేను వ్యవసాయం కోసం బ్యాంకు నుంచి రూ.85 వేలు అప్పు తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఎంతో ఆశ పెట్టుకున్నా. రేషన్ కార్డు కోసం చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా.. కార్డు రాలేదు. మా లాంటి గిరిజనులకు చాలా మందికి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవు. దీని వల్ల నా అప్పు మాఫీ కాలేదంటున్నారు. ఇది ఎంతవరకు కరెక్టు. ముందు నిబంధనలు చెప్పకుండా రూ.2 లక్షలు రుణమాఫీ అని చెప్పారు. ఇప్పుడు కొర్రీలు పెడుతూ రుణమాఫీ చేయడం లేదు.

–సోరెం సూరప్ప, రైతు, అశ్వారావుపేట

నా రుణం మాఫీ చేయలేదు..

నాకు మొండికుంట యూనియన్ బ్యాంకులో రూ.2.80 లక్షల అప్పు ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడంతో మాఫీ కాలేదు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే.. రూ.2 లక్షలలోపు రుణాలను మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసిందని చెప్పారు. రూ.2 లక్షలు పైబడిన వారి రుణాలు ఎప్పుడు చేస్తారో తెలియదంటూ పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. అందరు రైతులతోపాటు నేను తీసుకున్న రుణం కూడా మాఫీ చేయాలి.

–కొడిమె వీరాస్వామి, రైతు, కుర్వపల్లి కొత్తూరు, అశ్వాపురం మండలం

రుణం చెల్లించినా మాఫీ కాలేదు..

రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణం మొత్తం చెల్లించినా నాకు మాఫీ కాలేదు. ఆ జాబితాలో నా పేరు కూడా లేదు. ప్రభుత్వం తీరు రైతులను ఇబ్బందికి గురిచేసేలా ఉంది. గత కేసీఆర్ ప్రభుత్వంలో రుణమాఫీ కోసం ఏ అధికారి వద్దకు తిరగకుండానే మాఫీ చేశారు. ఇప్పుడు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా మాఫీ కావడం లేదు. ఒక వైపు రైతుబంధు లేదు.. మరోవైపు రుణమాఫీ కాకపోవడంతో రైతులను మరింత ఆందోళనకు గురిచేసే విధంగా ప్రభుత్వ పాలన ఉంది.

–సోడె భిక్షమయ్య, రైతు, కుర్వపల్లి కొత్తూరు, అశ్వాపురం మండలం

సాయం అందక ఇబ్బందులు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల పంటల సాగుకు రైతుబంధు సాయం అందకపోవడంతో నానా ఇబ్బందులు పడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం పంటల సాగుకు ముందుగానే ఎకరాకు రూ.5 వేల చొప్పున సాయం అందించి ఆదుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల సాగు పూర్తయినా సాయం అందించకుండా రైతులను మోసం చేసింది. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది.

–శీలం లచ్చిరెడ్డి, రైతు, కర్రాలపాడు, పెనుబల్లి మండలం

రైతులను మోసం చేసిన సర్కార్

వానకాలం పంట పెట్టుబడి సాయం రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందించకుండా మోసం చేసింది. రూ.2 లక్షల రుణమాఫీ ఇవ్వకుండా రైతులను మోసం చేయడంతోపాటు రైతుబంధు కూడా సర్కార్ అందించలేదు. ఇచ్చిన మాట తప్పిన ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత వచ్చింది. మాయమాటలు చెప్పడం తప్ప రైతులకు చేసిందేమీ లేదు.

–కాకా ప్రసాద్, రైతు, తాళ్లపెంట, పెనుబల్లి మండలం

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వినతులు స్వీకరిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, డిసెంబర్ 2 : ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో చేయూత పింఛన్లు, సదరం సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదుల సహాయ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి పరిశీలించిన కలెక్టర్.. వాటిని రిజిస్టర్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, బోనకల్ మండలానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రతినిధులు, ఖమ్మం నగరంలోని వేణుగోపాల్ నగర్ చెందిన వెంకటనర్సమ్మ, తిరుమలాయపాలెం మండలం రమణతండాకు చెందిన సునీత తమ తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను ఆయా శాఖల ఉన్న తాధికారులు పరిష్కరించాలని ఆదేశిస్తూ కలెక్టర్ వారికి పంపించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

పది రోజులుగా 'భగీరథ' నీరు రాకపోవడంతో ఆందోళన

వెంకటాపురంలో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

చండ్రుగొండ, డిసెంబర్ 2 : పది రోజులుగా మిషన్ భగీరథ నీరు నల్లాల ద్వారా సరఫరా కాకపోవడంతో విసుగు చెందిన మహిళలు, గ్రామస్తులు మండలంలోని వెంకటాపురం గ్రామంలో తిప్పనపల్లి–సుజాతనగర్ రహదారిపై సోమవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పది రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదని పలుమార్లు పంచాయతీ అధికారులు, సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ గ్రామంలో 50 ఇళ్ల వరకు ఉన్నా.. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని, కిలో మీటర్ దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీరు సరఫరా చేయని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

అర్హులైన గిరిజనులకే సంక్షేమ పథకాలు

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్

గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో

భద్రాచలం, డిసెంబర్ 2 : గిరిజన కుటుంబాలలో అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్ అన్నారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించిన ఏపీవో.. తన పరిధిలోని వాటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక సాయం, గురుకులం సీట్లు, పై చదువులకు ఆర్థిక సాయం తదితరాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేయించి, ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఆర్‌సీవో గురుకులం నాగార్జునరావు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఎస్‌వో భాస్కర్, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా, ఎస్‌డీసీ ఉదయ్‌కుమార్, డీటీఆర్‌వోఎఫ్‌ఆర్ లక్ష్మీనారాయణ, కొండరెడ్ల విభాగం అధికారి మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ర్యాలీ

సిద్ధాంతాల పేరుతో ఆదివాసీలను హతమారుస్తున్నారని ఆరోపణ

కొత్తగూడెంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 2 : సిద్ధాంతాల పేరుతో మావోయిస్టులు పోలీస్ ఇన్ఫార్మర్ల పేరుతో అమాయక ఆదివాసీలను హతమారుస్తున్నారని ఆరోపిస్తూ ప్రజా సంఘాల నాయకులు ప్లకార్డులతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తమ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ ఆదివాసీలను హత్య చేయడం దారుణమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధికి ఆటంకంగా మారుతూ, అక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులు ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఎంతో మంది పేద, అమాయక ఆదివాసీలను ఇన్ఫార్మర్ నెపంతో హత్య చేస్తూ, వారిని తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి ఊకె అర్జున్, అతడి సోదరుడు రమేశ్‌లను పోలీస్ ఇన్ఫార్మర్ల నెపంతో గొడ్డళ్లతో నరికి అతి దారుణంగా చంపడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. వీటిపై పౌరహక్కుల సంఘాలు, మానవ హక్కుల సంఘాల నాయకులు మౌనం వహించడం సమంజసం కాదన్నారు. పోరాటాల పేరుతో ఆదివాసీలను చంపడమే వారి సిద్ధాంతమా? అని ప్రశ్నించారు. తమ ఉనికిని కాపాడుకోవడం కోసం దళిత బిడ్డ నీల్సో అలియాస్ రాధ, ఆదివాసీలైన రమేశ్, అర్జున్ వంటి వాళ్లను హతమారుస్తున్నారని ఆరోపించారు. ర్యాలీలో ప్రజా సంఘాల నాయకులు సాగర్ మల్ల్లోతా, నాగరాజు, హేమంత్, అస్లాం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన దీక్ష

తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

నిరసన దీక్షలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 2 : ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లోని సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం అర్బన్ ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సీఆర్పీలు, ఐఈఆర్‌పీలు, పీటీఐలు, మెస్సెంజర్స్‌లు సోమ, మంగళవారాల్లో నిరసన దీక్షలో పాల్గొనన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే తమను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ.. ఇప్పుడు హామీని విస్మరించారన్నారు. రెగ్యులరైజ్ చేసేలోగా టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు పీఆర్‌టీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చైతన్యకుమార్, బాలకృష్ణ, అనిల్‌కుమార్, వీరన్న, రామలింగం, లత, రమాదేవి, రాంసింగ్‌నాయక్, ఎస్‌కే ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అధ్వానం

- ముగ్గురు మంత్రులున్నా విద్యార్థుల భవిత పట్టట్లేదు..
- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కందుల మధు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకుడు కందుల మధు

ఖమ్మం, డిసెంబర్ 2 : ఖమ్మం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని, జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా పేద విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కందుల మధు అన్నారు. సోమవారం ఖమ్మంలోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ విద్యార్థి సంఘ నాయకుల ప్రతినిధి బృందం గత మూడ్రోజులు ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. అపరిశుభ్రమైన వాతావరణంలో కనీస సౌకర్యాలు లేకుండా గురుకులాలు దర్శనమిస్తున్నాయని, పౌష్టికాహారం, నాణ్యమైన విద్య లేకపోతే విద్యార్థులు ఎక్కువ నష్టపోతారన్నారు. తక్షణమే మంత్రులు చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల ముట్టడికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ ఏడాది కాంగ్రెస్ పాలనలో 350 మంది గురుకుల విద్యార్థులు అస్వస్థతకు గురై 40 మందికిపైగా చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కొంతమంది గురుకులాల ఉద్యోగులు కాంగ్రెస్ ఏజెంట్లుగా ప్రవర్తిస్తున్నారని, వారి తీరు మార్చుకోకపోతే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్‌వీ కో ఆర్డినేటర్లు కోరేపల్లి మహర్షి, పండు, ఉపేందర్‌రెడ్డి, మేడి అనిల్, మామిడి భాస్కర్ పాల్గొన్నారు.

బాధితుల ఫిర్యాదులపై స్పందించాలి

గ్రీవెన్స్ డేలో భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 2 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే బాధితుల సమస్యలపై వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఆయన సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి దిశానిర్దేశం చేశారు.